# టూ-ఇన్-వన్

## శ్రీధర

అయిపోయింది——

ఆ అనుబంధం కాస్తా పుటుక్కున తెగిపోయింది- ఇప్పుడింక ఏమనుకుని ఏం లాభం? అందులోనూ ఇది కాలం ఖర్మం కల్సిరాక దైవికంగా వచ్చిపడిన అవాంతరం కాదు. ఏరికోరి, పోరిపోరి కావాలని తెచ్చిపెట్టుకున్న ఉపద్రవం! కనుక ఎవర్నీ నిందించటానికీ లేదు.

అసలారోజు రాత్రి సాధన మొదటిసారిగా తన ఆలోచన బయటపెట్టినప్పుడు, శ్రీవాత్సవ దాన్నొక జోక్‌లా తీసుకున్నాడు. కానీ పదేపదే అదే అనటంతో విసుగొచ్చి 'నీకేమన్నా పిచ్చెక్కిందా?' అని గదమాయించాడు, అయినా సాధన వినిపించుకోలేదు. తన మొండిపట్టుదల విడవలేదు.

"అవునండీ. తప్పేముంది? నిజంగా మనం విడిపోవటం లేదు-కేవలం రికార్డుకోసం ఉత్తుత్తిగా విడాకులు తీసుకుంటాం. లోకంకోసం నాలుగురోజులపాటు విడిపోయినట్లు నటిస్తాం. తర్వాత మళ్ళీ కల్సిపోతాం... ఎవడు పట్టించుకుంటాడు?" అంది సాధన

"కేవలం నటనకైనా సరే, మనం విడిపోవాలన్న ఆలోచనే నాకు నచ్చటం లేదు. ఆ ఊహనే నేను భరించలేకపోతున్నాను" అన్నాడు శ్రీవాత్సవ.

"సపోజ్, మీకు ట్రాన్స్‌ఫర్ అయిందనుకోండి- కొన్నాళ్ళపాటు చెరో చోటా ఉంటామా, లేదా? ఇదీ అలాగే అనుకుందాం. పైగా మనం ఊళ్ళోనే ఉంటాం. బుద్ధిపుట్టినప్పుడల్లా కల్సుకుంటూ ఉంటాం. అనుకున్న పని పూర్తయ్యాక, మళ్ళీ మనం కల్సిపోదాం... ఇంక మీరు కాదనకూడదు. ఒప్పుకోవాలి" అంటూ సాధన విడాకులకోసం చెవిలో జోరీగలాగా పోరటం మొదలెట్టింది.

వద్దని చెప్పిచెప్పీ విసిగిపోయ్యాడు శ్రీవాత్సవ. చివరికింక 'నీ ఇష్టం' అనేశాడు.

"నీ బుర్రలోకి ఏదన్నా ఒక ఆలోచన వచ్చిందంటే, అది సాధించేదాకా నిద్రపోవు. అందుకే మీవాళ్లు నీకాపేరు పెట్టారు" అనీ అన్నాడు.

"ఇప్పుడు మీకు కష్టంగా ఉండొచ్చు. కానీ నా ప్లాన్ సక్సెస్ అయ్యాక అప్పుడు మీరే మెచ్చుకుంటార్లెండి" అంది సాధన.

తిట్టుకుంటూనో, దీవించుకుంటూనో శ్రీవాత్సవ 'నీ ఇష్టంవచ్చినట్లు ఏడువ్' అన్నాక, ఆమె వెళ్లి వాళ్ల లాయర్ బాబాయిని సంప్రదించి రంగం సిద్ధం చేసింది. ఇంక కోర్టుసీన్‌లో, బోనులో నిలబడి, చాలా దయనీయంగా ముహం పెట్టి——

"దేవుడిమీద ప్రమాణంచేసి అంతా నిజమే చెబుతాను, అబద్ధం చెప్పను" అని దేవుడిమీద ప్రమాణంచేసి అన్నీ అబద్దాలే చెప్పింది.

"నా భర్త తాగుబోతు. వ్యసనాలకు బానిస. తన సంపాదన అంతా ఆ వ్యసనాలకు తగలేసుకోవటమే గాక, నా సంపాదన అయినా నాకు దక్కనివ్వటంలేదు. రోజూ తాగి ఇంటికొచ్చి వంగదీసి వీపుమీద గుద్దుతాడు- పొట్టలో బూటుకాలితో తంతాడు - కాలే సిగరెట్టుతో వంటినిండా చురకలు పెడతాడు. క్రూరాతిక్రూరంగా హింసిస్తున్నాడు. పైగా మరో స్త్రీని ఉంచుకుని, అక్కడే ఉంటున్నాడు. నన్నూ, నా పిల్లల్నీ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాడు... కనుక దయచేసి నాకు విడాకులు ఇప్పించి ఈ నరకంనుండి రక్షించండి..." అని వేడుకుంది.

అప్పుడా కోర్టులో ఉన్నవాళ్లంతా 'నువ్వింత వెధవ్వా?' అన్నట్లు అతని వైపు చూశారు. ఆ చూపులన్నీ చురకత్తుల్లా గుండెల్లో గుచ్చుకుంటున్నా తట్టుకుని నిలబడి, తన పరువు ఎలాగూ పోయింది కాబట్టి భార్య పరువు అయినా నిలబెడదామని, ఆమె ఆరోపణలన్నీ నిజమని ఒప్పుకున్నాడు.

అప్పుడు లాయర్, అదే లాయర్, రెచ్చిపోయి "యువరానర్, దిసీజ కేసాఫ్ క్రూయల్టీ అండ్ అడల్టరీ" అంటూ తన అనూన వాగ్ధాటితో వాదిస్తూ భర్త ఎంతటి నరరూప రాక్షసుడు కాకపోతే ఒక సుగుణవతి, శీలవతి, అభిమానవతి ఇలా కోర్టుకెక్కి తన గోడు భోరుభోరున విన్నవించుకుంటుందో ఆలోచించమని సూచించాడు కూడా.

అవమానంతో తల కొట్టేసినట్లు అయిపోగా, శ్రీవాత్సవ ఇంటికొచ్చి,

మొదటి సారిగా చెట్టులా కోర్టులో వాలి పోయ్యాడు.

సాధన మాత్రం పకపకా నవ్వుతూ "ఆ జడ్జీ అంతా సీరియస్‌గా నమ్మేసి నట్లున్నాడు. కోర్టులో నా యాక్షన్ చూశారా ఎంత నాచురల్‌గా ఉందో, అసలు ఈ ఏడాది ఊర్వశి అవార్డు నాకే ఇవ్వాలి" అంటూ భర్తకు కాఫీ అందించింది.

శ్రీవాత్సవ ఆమె మాటలు వినటం లేదు. కళ్ళువిప్పి ఆమెవంక చూడటం కూడా లేదు. నిద్రలోనో, నిష్టలోనో ఉన్నవాడిలాగా. మౌనముద్ర దాల్చాడు. అప్పుడామె పక్కనకూర్చుని అతని మోకాళ్ళమీద చుబుకాన్ని ఆన్చి, కుదిపి, కళ్ళుతెరిపించి లాలనగా అడిగింది.

"ఏమండీ? ఏమిటలా ఉన్నారు! ఆర్ యు రియల్లీ ఫీలింగ్? అనుకున్నాం కదా, జస్ట్ డ్రామా... ఇదంతా లోకం కోసం మనం ఆడుతున్న నాటకం... సంసారాన్ని ముక్కలు చేసుకోకు..."

"ఆ, పోదురూ! మీరంతా మరీ చాదస్తం- ఇంతలోనే ఏమైపోయిందని అంత ఇదిగా మాట్లాడతారు? నన్ను విడిచి మీరుండలేరు. మిమ్మల్ని విడిచి నేనుండలేను. మన మధ్య ఆ అనుబంధం అంత పటిష్టంగా ఉన్నంతకాలం. మనల్ని దేవుడు కూడా విడదీయలేడు ...ఇంక ఇదంతానంటారా, చెప్పాను గదా. జస్ట్ ఫర్ రికార్డ్స్ సేక్..." అంది సాధన మళ్ళీ మొదటికొచ్చి.

శ్రీవాత్సవ నిట్టూర్చాడు. "నేను చెప్పవల్సింది చెప్పాను. ఇంక నిన్ను భగవంతుడే కాపాడాలి..." అన్నాడు.

భర్తకు కోపంవచ్చిందని సాధనకు తెలుసు. కానీ మగవాడు ఎప్పుడూ ఇవాల్టి రోజు సుఖంగా గడవటమే చూసుకుంటాడు. రేపటిగురించి ఆలోచించి జాగ్రత్త పడాల్సిన డ్యూటీ ఆడదానిదే. కనుక పిల్లలకు వెలో కొంచెం అమర్చాలని తాను ఆశపడటంలో తప్పేముంది? ఇంక ఆయన కోపం సంగతా? ఆలుమగల మధ్య కోపం ఎంతసేపుంటుంది? రాత్రి అన్నంతినేదాకా ఉంటుంది? తర్వాత మళ్ళీ మామూలే — అనుకుంది సాధన.

వీళ్ళ విడాకుల ఉదంతం, ఊరూ వాడా పొక్కిపోయింది, తెల్సినవాళ్ళూ, తెలియనివాళ్ళూ వీళ్ల కథని ఈజీ ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెప్పుకుంటున్నారు.

'రోజూ తాగి ఇంటికెళ్లి పెళ్ళాన్ని తంతాట్ట. ఎవత్తెనో ఉంచుకున్నాట్ట. ఇలాంటివాడిదగ్గర అదిమాత్రం ఎన్నాళ్లు ఉంటుంది? ఉన్నదీ పోయింది, ఉంచుకున్నదీ పోయిందని ఏదో ఒకరోజు ఏడుస్తాడు. అసలు వాడి మొహం చూస్తే అలా కనిపించడయ్యా? చెప్పలేం. కొందరు పైకి కనిపించకుండా ముచ్చులా ఉంటారు...'



"లోకం కోసమే అయినా చాలా దారుణమైన నాటకం ఆడుతున్నావు. దీని పర్యవసానం మాత్రం ఎవరికీ ఆహ్లాదంగా ఉండదు. ఇప్పటికైనా మించి పోయింది లేదు. ఈ నాటకానికి ఇంతటితో తెర వేసేసి. రేపే కోర్టులో కేసు విత్‌డ్రా చేసుకో... భర్తగా ఇది నీకు నా ఆఖరి ఆజ్ఞ..." అన్నాడు చాలా సీరియస్‌గా.

"అయినా సరే నేను వినను-" అంది సాధన మొండిగా.

"పోనీ నీ మేలు కోరే ఒక స్నేహితుడిగా సలహా ఇస్తున్నాను- వింటు

ఈ కాకిగోల శ్రీవాత్సవను వెన్నంటి వస్తూనే ఉంది. అందరూ అనేవన్నీ అతనికి వినిపిస్తూనే ఉన్నాయి. చెవుడేం లేదుకదా మరి - నిజంగా తాగి, తన్ని తగలేసే చప్రాసీ వెధవలకీ శ్రీవాత్సవ లోకువైపొయ్యాడు. ఎందుకంటే వాళ్ల పెళ్లాలు కోర్టుకెక్కలేదు మరి.

ఆరోజు సాధన చాలా సంతోషంగా ఇంటికొచ్చింది. కోర్టు విడాకులు మంజూరుచేసింది. ఆ కాగితాలు తెచ్చి భర్తకిచ్చింది. అప్పుడామె ముహం చూస్తే ఎవరెస్ట్‌మీద జెండా పాతివచ్చిన దానిలా ఆనందంతో వెలిగిపోతోంది.

అయిపోయింది— మూడుముళ్ల అనుబంధం రాస్తా పుటుక్కున తెంచేసింది. ఇంతా చేసింది దేనికోసమని అడగరేం? గవర్నమెంటువాళ్ళు ఇచ్చే లోన్‌కోసం.

"ఊఁ. ఇప్పుడు చెప్పండి......ఈ విడాకుల కాగితాలు మీ ఆఫీసులో మీరు, నా ఆఫీసులో నేనూ సబ్‌మిట్ చేస్తాం. తర్వాత ఇద్దరం మీ ఆఫీసులో మీరు, మా ఆఫీసులో నేనూ లోన్స్ తీసుకుంటాం. ఇల్లు కట్టుకోవటానికి అరవై వేలు, స్కూటరు లోన్ తొమ్మిదివేలు, ప్రావిడెంట్ ఫండ్‌నుంచి, క్రెడిట్ సొసైటీ నుంచి కూడా వచ్చినంత తీసేసుకుందాం. మీ పేరుమీద ఒక లక్ష, నా పేరున ఒక లక్ష పోగుచేసి, చెరో ఇల్లు కట్టేస్తాం. ఇద్దరి పిల్లలకు చెరోటీ కావాలి కదా... డైవర్స్ తీసుకోకపోతే ఇద్దర్లో ఎవరో ఒకరికి లోన్ ఇస్తారు. ఒక ఇల్లే అవుతుంది. మిగతాదంతా ఏ నెల కానెల కనగపప్పులా తినేస్తాం. జన్మంతా పోగుచేసినా ఒక లక్ష రూపాయలు జమచెయ్యగలమా? రెండో ఇల్లు కట్టించగలమా? ఇవాళ నేను చేసిన పని మీకు కష్టంగా ఉండొచ్చు. కానీ మన సంసారం మేలుకోరే ఈ పని చేశాను. నేను అంత గట్టిపట్టు పట్టకపోతే, మీరు ఇందుకు ఒప్పుకోరు. రెండో ఇల్లు కట్టటం మనవల్ల కాదు..."

"అన్నివేల రూపాయలూ మనకెవరూ అప్పనంగా ఇవ్వటం లేదు. అప్పుగా మాత్రమే ఇస్తున్నారు..."అని గుర్తుచేశాడు భార్యకు.

"నిజమే, అప్పు మాత్రం మనకెవరిస్తారు? ఏదీ, వెళ్ళి ఒక వెయ్యి రూపాయలు పట్రండి, చూస్తాను. అది మళ్ళా తీర్చండి చూస్తాను. ఎన్ని నెలలు పడుతుందో? జీతంలో పట్టుకుంటే మిగతా దాంతో ఎలాగోలా అవస్థపడతాంగానీ, విడిగా దమ్మిడీ దాచలేం. మనకు తెలియనిదేముంది?" అని నచ్చచెప్పే ప్రయత్నం చేసింది.

ఎన్ని చెప్పినా ఇంత దొంకతిరుగుడుగా, అప్పుతెచ్చి ఇల్లు కట్టటం అతనికి బొత్తిగా నచ్చలేదు. సంసారం అంటే ఏమిటి? మంచి సారముగలది అని కదా అర్థం. చెరోదారి అయిపొయ్యాక, అంతా నీరసమేగాని, నిస్సారమేగాని, సారమేముంది? ఒకరికొకరు కాకుండా పొయ్యాక, ఇంక ఎన్ని ఇళ్ళు ఉండీ, ఎన్నీ పొలాలుండీ ఎవర్ని ఉద్ధరించను? ఈ వాదనంతా సాధన చెవికెక్కదు. రెండురోజులు కష్టంగా ఉన్నా అంతా అదే సర్దుకుపోతుందని, ఆమె నమ్మకం.

అయితే శ్రీవాత్సవ ఆమె నమ్మకం మీద అప్పుడే పెద్దదెబ్బ కొట్టాడు. ఆ రోజు ఉదయమే నిద్రలేచి చూసుకునేటప్పటికి మెళ్ళో గొలుసు లేదు. గుండె గుభిల్లుమంది. నిద్రలో ఎక్కడో పడిపోయిందని వెతుక్కుంటుంటే శ్రీవాత్సవ అన్నాడు.

"వివాహాన్ని రద్దుచేసుకున్నాక, ఇంకా ఆ వివాహానికి చిహ్నాలైన మంగళసూత్రాలు నీ మెడలో ఉండకూడదు. తీసి బీరువాలో లాకర్‌లో పెట్టాను. మళ్ళీ పెళ్ళిచేసుకునేదాకా మంగళసూత్రాలు వేసుకునే అర్హత నీకు లేదు..."

"ఎందుకు లేదు? మీరున్నారు కదా?" అంది భయంగా చూస్తూ. మంగళసూత్రాలు తీసెయ్యటం అమంగళంగా అనిపిస్తోంది.

"నేనున్నాను. కరెక్టే. కానీ ఇప్పుడు నేను నీకు మొగుడ్ని కాదు. నీ కిప్పుడు ఏమీ కాను..." అన్నాడు శ్రీవాత్సవ చాలా ఆవేశంగా.

భర్త ముహంలో అంత కోపం సాధన ఇంతకు ముందెప్పుడూ చూడలేదు. అందుకనే అవాక్కయిపోయింది. కానీ బోసిగా ఉన్న మెడ ఆమెను వెక్కిరిస్తోంది. సూత్రాలు తీసేసి, పొట్టి గొలుసు వేసుకుంది—అదీ జాకెట్టు లోపలికి.

స్కూల్లో పేరెంట్స్‌డేకి రమ్మని పిల్లలు తండ్రిని అడిగితే "నేను రాకూడదు నాన్నా" అని చెప్పి పంపేశాడు. ప్రొగ్రెస్ రిపోర్టుల మీద సంతకాలు కూడా సాధనే పెట్టాల్సివచ్చింది.

శ్రీవాత్సవలో చూస్తుండగానే చెప్పరానంత మార్పు వచ్చేసింది. ఊరికినే పిల్లల్ని కొడుతున్నాడు. సాధనను తిడుతున్నాడు. ఎందుకిలా అయిపోతున్నారంటే, 'హూ ఆర్ యూ' అంటూ దబాయించేస్తున్నాడు.

ప్రతినెలా జీతం రాగానే, తెచ్చి సాధన చేతికిచ్చేవాడు. ఇంటి ఖర్చుకు అంతా ఆమే వాడేది. దేనికెంత ఖర్చు అవుతుందో శ్రీవాత్సవ ఎన్నడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఎంత ఖర్చు అవుతుందో మీరూ తెలుసుకోండి అని సాధన అంటే, 'నువ్వున్నంత వరకూ నాకా అవసరం లేదు చిన్నా' అనేవాడు నిండుగా నవ్వుతూ.

కానీ ఈసారిమాత్రం శ్రీవాత్సవ తన జీతం ఆమెకు ఇవ్వలేదు. "మీ జీతమేది?" అని అడిగితే "నువ్వెవరు. నా జీతం లాక్కోవటానికి? అంటు

నిన్ను ఎప్పుడు నే చూపినట్లు లేదే? మీ ఇల్లెక్కడ? ఎవరమ్మాయివి?" అన్నాడు చిరాగ్గా.

నోరువిప్పాక తెల్సింది, అయ్యావారు గుర్రమెక్కి వచ్చారని. రెండోసారి కాఫీ కూడా తాగని మనిషి ఇప్పుడు విస్కీ తాగి వచ్చాడన్నమాట! భేష్! బావుంది! చదవేస్తే ఉన్నమతి పోయిందని...


ఆ రాత్రికి అతనితో ఏం మాట్లాడదల్చుకోలేదు. మర్నాడుదయం నిలదీసి అడిగింది.

"మీ ప్రవర్తన నాకేం నచ్చలేదు..."

"నాకు నీ కాండక్ట్ సర్టిఫికేట్ అక్కర్లేదు. కాని ఓ హండ్రెడ్ చిప్స్ కావాలి. ఎక్కడపెట్టావ్?" అంటూ అల్మారా తెరవబోతుంటే, సాధన అడ్డంగా నిలబడింది, రెండు చేతులూ చాపి.

శ్రీవాత్సవ మెడపట్టుకు వంచి వీపున ఒక్క గుద్దు గుద్దాడు. బొక్కబోర్లా పడి ముక్కుపగిలి రక్తం కారింది. శ్రీవాత్సవ అల్మారా తెరిచి డబ్బు జేబులో పెట్టుకుని వెళ్ళిపోతూ అన్నాడు.

"సారీ, సాధనగారూ. కోపంలో పెద్దగా గుద్దినట్లున్నాను... నిన్ను నేను చాలా ఇదిగా లైక్ చేశాను. అఫ్‌కోర్స్, ఇప్పుడు కాదనుకో...అయినా నువ్వు ఏడుస్తుంటే, అదీ నా మూలంగా ఏడుస్తుంటే చూసి తట్టుకోవటం నాకు శక్తికి మించిన పని అవుతోంది. అందుకని నీమీద చెయ్యి చేసుకోవటం, ఇదే మొదటిసారి, చివరిసారీ కూడా అని దేవుడిమీద ప్రమాణంచేసి, ఛీఛీ, నువ్వు దేవుడి విలువను కూడా పోగొట్టావు, కనుక మన పిల్లలమీద ప్రమాణం చేసి చెబుతున్నాను. ఇంతకీ అసలు విషయం —నేను చెడ్డవాణ్ణి అని ఎలాగూ చాటింపు వేశావు. పోయిన పరువు ఎలాగూ పోయింది. నిండగా మునిగినవాడికి




చలేమిటి? అందుకనే కోర్టులో నువ్వు వాగిన అవాకులు చవాకులూ అన్నీ నిజం చెయ్యదల్చుకున్నాను. చేసి తీరుతాను. వెళ్ళేముందు ఇంకొక్కమాట చెప్పి వెళ్తాను. ఆడదాని ఆశకు అంతులేదు. ఆ సంగతి తెల్సి, నువ్వు చెప్పినట్లల్లా విన్నాను. ఇవాళ జరిగిన వడ్డన, నువ్వు విడాకులు అడిగిన రోజునే జరిగిఉంటే, బావుండేది. అదొక్కటే నా పొరపాటు ........" అనేసి వెళ్ళిపొయ్యాడు శ్రీవాత్సవ.

సాధన ఈ షాక్‌నుంచి తేరుకోవటానికి చాలా రోజులు పట్టింది. ఇద్దరూ ఒక మాటమీద ఉండి, నలుగురి కోసం నాలుగు రోజులూ చిన్న నాటకం ఆడితే, ఇద్దరి పేరుమీదా చెరో ఇల్లు అమరుతుందనే ఆశపడింది గాని, దీన్ని ఆయనింత సీరియస్‌గా తీసుకుంటాడని అన్నదల్లా నిజం చేస్తాడని కల్లోకూడా ఊహించలేదు. పరిస్థితులిలా విషమిస్తాయని తెలిస్తే, ఇంత సాహసం చేసేది కాదు. సంసారం బాగుపడాలి అన్న యావ ఆయనకు లేకపొయ్యాక తనకు మాత్రం ఎందుకు?

మొత్తంమీద ఇద్దరిదీ చెరో దారి అయింది. శ్రీవాత్సవ వేరేగా ఉంటున్నాడు. సాధన కూడా ఇల్లు మారింది. తీసుకోవాల్సిన రుణాలన్నీ తీసుకున్నాకే, మెహిదీపట్నం అవతల ఆమె, తారనాకా ఇవతల ఇతనూ ఇల్లు కట్టటం మొదలెట్టారు.

అప్పుడప్పుడూ సాధనే భర్తకు ఫోను చేసేది. అతను ముభావంగా మాట్లాడేవాడు. ఒక్కోసారి ఉండీ, లేడని చెప్పించేవాడు.

ఆరునెలల్లో సాధన ఇల్లు కట్టటం పూర్తి అయింది. గృహప్రవేశానికి ముహూర్తమూ పెట్టుకుంది. కార్డులు అచ్చువేయించింది. ఆఫీసులో వాళ్ళందరికీ ఇవ్వాలి కాబట్టి అందులో తనపేరు మాత్రమే వేయించుకుంది. భర్తకు ఫోను చేసింది.

"ఎవరూ?" అని అడిగాడు శ్రీవాత్సవ.

"నేను, చిన్నాను" ఆమాట అనగానే ఫోన్ డిస్‌కనెక్ట్ అయింది.

ఆ సాయంత్రం సాధన శ్రీవాత్సవ దగ్గరకు వెళ్ళింది. కొత్తఇంట్లో ముందు గదిలో చాపమీద పడుకుని ఘంటసాల పాట వింటున్నాడు, కళ్ళు మూసుకుని—
నీ వ్యధ తెలిసీ నీడగ నిలిచే తోడొకరుండిన అదే భాగ్యము...

సాధన వెళ్ళి పక్కన కూర్చుని మీద చెయ్యివేసింది. శ్రీవాత్సవ కళ్ళు తెరిచిచూసి, లేచి కూర్చున్నాడు.

"ఎలా ఉన్నారు?" అని అడిగింది.

"నాకేం? బాగానే ఉన్నాను."

"నా మీద ఇంకా కక్ష సాధిస్తున్నారన్నమాట..." అంది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

"ఇది ఇంకో కొత్త ఆరోపణ అన్నమాట. కానీ నిజానికి నీ మీద కక్ష సాధించటం లేదు. నిన్ను మర్చిపోవటానికే ప్రయత్నంచేస్తున్నాను."

"అదే కక్షసాధించటం అంటే..."

"అది కక్ష ఎలా అవుతుంది? నన్ను వదిలించుకుందామనే కదా నీ ఉద్దేశ్యం..."

"అలాంటి మాటలు అనొద్దు...మీకు దూరమై నేను బతకలేను..." అంటూ భర్తను అంటిపెట్టుకుని ఏడ్చింది. తర్వాత తెప్పరిల్లి గృహప్రవేశానికి ఆహ్వానిస్తూ కార్డు ఇచ్చింది.

"నిజానికి మనిద్దరం వెళ్ళి అందర్నీ పిలివాలి. కాని పరాయివాళ్ళకు ఇచ్చినట్లు మీకూ ఇన్విటేషన్ ఇచ్చి పిలుస్తున్నాను...ఇదంతా నా ఖర్మ...మీరే వచ్చి అన్నీ చూసుకోవాలి. ఆడదాన్ని నావల్ల ఏమవుతుంది?" అంది సాధన.

"అలాగే వస్తాను. పరాయిదైనా ఒక స్త్రీ సాయంచేయమంటే చేసిపెడతాం కదా, సాధనగారూ...మొత్తంమీద ఒక ఇంటిదానివి అయినావన్నమాట. కంగ్రాట్స్ సాధనగారూ" అన్నాడు నవ్వుతూ.

"ఆ పిలుపేమిటి? నేను మీ చిన్నాను..." అంది సాధన.

"అవన్నీ గుర్తుచెయ్యకు. గుండె గాయాన్ని రేపకు" అన్నాడు మొహం మాడ్చుకుని.

ఆమె టు-ఇన్-వన్ వంక చూసింది. రేడియో ట్యూన్ చేసింది- 'మీది మధ్యతరగతి కుటుంబమా, మీ భవిష్యత్తూ. మీ పిల్లల భవిష్యత్తూ ఆలోచించారా? దేవుడిమీద భారం వేసారా?'- అంటూ వినపడుతుంటే.'

శ్రీవాత్సవ ఠక్కున రేడియో కట్టేసాడు. సాధన అడిగింది.

"ఇప్పుడిది కొన్నారా? ఈ డబ్బు పెడితే బయట ప్లాస్టరింగ్‌కు సిమెంటు, అయినా వచ్చేది కదా..."

"నీకు జీవితం అంటే సిమెంటు, ఇటుకా, ఇసుకలారీలూ తప్ప ఇంకేమీ కాదు" అన్నాడతను కటువుగా.

సాధన దీర్ఘంగా నిట్టూర్చింది. "సంగీతాలూ, సాహిత్యాలూ కడుపు నిండినవాళ్ళకే గాని, కడుపుమండే వాళ్ళకు కాదండి... జీవితంలో ఇంట ర్వెల్‌కు దగ్గరపడ్డాం. ఇకనైనా మెటాఫరికల్‌గా ఆలోచించటం మానేసి, మెటీరియలిస్టిక్‌గా ఆలోచించాలి..."

"అంతవరకూ ఒప్పుకుంటాను.కానీ అడ్డదిడ్డంగా నైనా సరే అర్పించాలనుకోవటం దగ్గరే వస్తోంది పేచీ..."

మళ్ళీ మొదటికే వచ్చామని తెల్సి, ఇంక సంభాషణ ఆపేసింది.

శ్రీవాత్సవ వెళ్ళి సాధన గృహప్రవేశానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేశాడు. మామిడాకుల తోరణాల దగ్గరనుంచీ అన్నీ ఆయనే చూసుకుంటుంటే, సాధనకు అంతులేని ఉత్సాహంగా ఉంది. వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. చెయ్యిజారవిడుచుకున్న స్వర్గాన్ని తిరిగి పొందుతున్నంత ఆనందాన్ని అనుభవిస్తోంది. ఇంకెప్పుడూ భర్తకు దూరంకాకూడదని మనసులోనే నిర్ణయించుకుంది. చేసిన బుద్ధితక్కువ పనికి చెంపలు వేసుకుంటోంది.

అన్ని ఏర్పాట్లూ చేశాక తీరా ముహూర్తం వేళకు, శ్రీవాత్సవ అంతలోనే మాయమైపొయ్యాడు. ఆమె ఆనందం అంతా తుపాకీదెబ్బతిన్న పిట్టలాగా రివ్వున ఎగిరిపోయింది. అతను ఉండటానికి వీలున్న చోటుకల్లా ఆటోలమీదా, స్కూటర్లమీదా మనుషుల్ని పంపించింది. కానీ అతను అయిపులేడు.

చివరకు సాధన తనే దేవుడిపటం పట్టుకుని ఇద్దరు పిల్లల్నీ వెంటబెట్టుకుని కొత్త ఇంట్లోకి ప్రవేశించింది. ఆయనకు ఎంత కోపం ఉన్నా, ఇలాంటప్పుడా సాధించటం? చుట్టాలు, పక్కాలూ, చుట్టుపక్కలవాళ్లు ఎక్కడెక్కడవాళ్లో వచ్చారు. కానీ తన భర్త, తన కష్టం, సుఖం భరించేవాడు, తన కళ్ళల్లో వెలుగు, ప్రాణంలో ప్రాణం అయిన ఆయన మాత్రం ఉన్నట్లుండి, సమయానికి మాయమైనాడు.

తల్చుకున్న కొద్దీ గుండె గొంతుకలోకి ఎగదన్నుకొస్తోంది. చెంపల మీద నుంచి కృష్ణా గోదావరీ నదులు వరదలై పొంగి పొర్లుతున్నాయి. ఇల్లంతా చల్లటానికి వేరే పుణ్యాహవాచనం నీళ్ళే అక్కర్లేకుండా, ఆమె కన్నీళ్ళే సరిపోయినయి.

ఉగ్గబట్టుకోలేక డాబామీదకు వెళ్ళి ఒక మూల కూర్చుని వెక్కివెక్కి ఏడ్చింది. పావుగంట తర్వాత ఆమె కొలీగ్ వచ్చి, బలవంతంగా తల పైకెత్తి కన్నీటిధారలు తుడిచింది.

"అందంగా ఇల్లు కట్టుకుని, ఆనందంగా కొత్త ఇంట్లోకి అడుగుపెడుతూ, అందర్నీ పిల్చుకొచ్చి గుమ్మంముందు కూర్చోబెట్టి, నువ్వొచ్చి ఇక్కడ కూర్చుని ఇలా వలవలా ఏడుస్తున్నావా? తప్పుకదూ..." అని ఓదార్చింది.

"చూడు రాధా, ఆయనేం చేశారో? సమయానికి ముఖం చాటుచేశారు. నేను దిక్కులేనిదానిలాగా, అనాధలాగా... పిల్లలిద్దర్నీ వెంటబెట్టుకొని ఇంట్లో కొచ్చేశాను. ఆయనే లేకపొయ్యాక నాకీ ఇల్లు ఎందుకు. వాకిలి ఎందుకు? అన్నీ ఆయనతర్వాతే నాకు...నేను బతికేదే ఆయన కోసం... ఆ సంగతి ఆయనకీ క్షుణ్ణంగా తెల్సు తెల్సీ నన్నిలా..."

ఆ స్నేహితురాలే సర్దిచెప్పి కిందకు తీసుకొచ్చింది. ఒక్కతే కూర్చుని ఒక

పక్క ప్రతం చేస్తూనే ఉంది. మరో పక్క చీదేస్తూనే ఉంది. ఆఫీసువాళ్ళే నలుగురు నడుం కట్టుకుని పంక్షను అయిందనిపించారు. వచ్చినవాళ్ళందర్నీ సాగనంపుతూ అటు తిరిగి బలవంతాన నవ్వుతోంది. ఇటు తిరిగి కన్నీటిచారలు కార్చేస్తోంది.

అందరూ వచ్చి తినేసి వెళ్ళారు గానీ, సాధన మాత్రం పచ్చిమంచినీళ్ళుకూడా ముట్టుకోలేదు. వంటాయన వచ్చి వేడి కాఫీ ఇస్తానంటే అదీ వద్దు అంది. అసలామెకు గొంతు పూడుకుపోయింది. కొత్త ఇంట్లో, నట్టింట్లో, గోడవైపు తిరిగి పడుకుని వెక్కివెక్కి ఏడ్చి ఎప్పటికో సొమ్మసిల్లి నిద్రపోయింది.

అమ్మ ఏడుపు ఎక్కువయ్యే కొద్దీ పిల్లలు తండ్రిని చూడాలని గొడవ చేయటం మొదలెట్టారు. ఫోను చేసినా ఆయన మాట్లాడరని తెల్సు. అనుకనే రెండురోజులు అయ్యాక ఆయనింటికి వెళ్ళింది. గంటసేపు బయట కూర్చున్నాక శ్రీవాత్సవ వచ్చాడు. లోపలికి వచ్చి కూర్చున్నాక అడిగింది.

"కోపం ఉంటే కొట్టండి, తిట్టండి. కానీ ఇలా గుండెకోత కోసి ఏడిపించవద్దు......ఉన్నట్టుండి మాయమైపోతే నేనేం కావాలనుకున్నారు? మొండిదాన్ని కాబట్టి ఈ గుండె ఆగిపోలేదు...ఏడ్చి ఏడ్చి కళ్ళు వాచిపోయినయి...అసలు మా స్టాఫ్, ఆఫీసర్సూ అంతా వచ్చారు. మిమ్మల్ని పరిచయం చేద్దామంటే..."

"ఏమని పరిచయం చేద్దామనుకున్నావు? నేను నీ మాజీ మొగుడ్ని అనా? ఆ మాట అనిపించుకోవటం ఇష్టంలేకనే అక్కడనుంచి వెళ్ళిపొయ్యాను..."

"నేను ఏడుస్తూనే ఉన్నాను. గుండె తూట్లుపడే మాటలంటూ ఇంకా ఎందుకేడిపిస్తారు?" అంది సాధన.

"ఇందులో ఇవాళ నేను కొత్తగా అంటున్నదేముంది? ఆ వేళ నువ్వు కోర్టులో చెప్పినదానికన్నా ఎక్కువైనవేం కావీ మాటలు- అక్కడికి గుండె నీ కొక్కదానికే ఉంటుందనుకోకు. అంతకన్నా సున్నితమైన హృదయమే నాకూ ఉంది. ఆడదానివి కాబట్టి ఏడ్చి అయినా నీ గుండెబరువు తగ్గించుకుంటున్నావు. నా కదీ చేతకావటం లేదు..." అన్నాడు శ్రీవాత్సవ.

వీళ్ళిద్దరూ గతం తవ్వుకుంటుంటే పిల్లలు ఇల్లంతా తిరిగి కేరింతలు కొడుతున్నారు- కాసేపటికి ఆమె వెళ్తానంది. ఉండమని అనలేదు. పిల్లలు తల్లితో రామని మొండికేశారు ఈరాత్రి వాళ్లను అయినా ఉండనివ్వమని సాధన అడిగినా శ్రీవాత్సవ ఒప్పుకోలేదు.

"ఒకసారి తెగిపోయిన అనుబంధాన్ని మళ్ళీ ముడివేసుకోవటం నా కిష్టం లేదు. నీ పిల్లల్ని నువ్వే పట్టుకుపో" అని పంపించేశాడు. కనీసం బస్‌స్టాప్ దాకా తోడుకూడా రాలేదు.


With best compliments from:

## SRI RUKMINI KRISHNA BOILED RICE & OIL MILL

Contractors:

**SRI KANURI DAMODARAYYA & CO.**

*Mg. Partners :* **D. R. N. Tagore, K. S. Krishna Murthy**

Venkateswarapuram, VIJAYAWADA-520 010.

Grams : BOILD RICE

Phone : 76016

ఆయన్ని అనటానికి లేదు, ఇదంతా తన ప్రారబ్ధం. కావాలని చేసుకున్నదే,

ఆవేళ శ్రీవాత్సవ ఆర్ట్సుకాలేజీ దగ్గర బస్సుదిగితే, ప్రియాంక కనిపించింది. ఇద్దరూ ఎమ్మేలో క్లాస్‌మేట్స్. కొన్నేళ్ల తర్వాత కలుసుకున్నారు. పి.హెచ్.డి. చేస్తున్నానని చెప్పింది. కాసేపు మాట్లాడుకుందామని లాండ్‌స్కేప్ గార్డెన్‌లోకొచ్చి కూర్చున్నారు. చదువుకునే రోజుల్లో అక్కడే కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకునేవాళ్ళు. అప్పట్లోనే పెళ్లిచేసుకుందామనుకున్నారు. కానీ పైకి తీసుకురావల్సిన తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ ఉండి ఆమె పెళ్లికి అడ్డు పడ్డారు. ఇంకా పెళ్లికాలేదని చెప్పింది.

ఆ రోజుల్లో ప్రియాంక లేత తమలపాకులా ఉండేది. ఇప్పుడు కాలం కొంచెం మార్పుతెచ్చినా, తమలపాకు తమలపాకే. అదే అంటే ఆమె నవ్వింది.

శ్రీవాత్సవ తన కుటుంబం సంగతి చెబితే అంతా విన్నాక ప్రియాంక అంది.

"ఇంత గొడవ ఎందుకుపడ్డారు. ఒకళ్లు గవర్నమెంటు లోను, ఒకరు ఫెడరేషన్ లోన్ తీసుకోకపోయ్యారా?"


"ఫెడరేషన్‌లోన్‌కు వడ్డీ ఎక్కువ కదా - అసలు మాకు తెలివితేటలు ఎక్కువ కదా" అన్నాడతను.

"అయితేమాత్రం, కన్ను పొయ్యేంత కాటుక పెట్టుకుంటారా ఎవరైనా?" అని అడిగింది.

"మేం పెట్టుకుంటాం" అన్నాడతను.

"యద్భావం తద్భవతి అని మనం ఏది అనుకుంటూ ఉంటామో అదే జరుగుతూ ఉంటుంది. ఇంతకీ నుదుట రాయనిదే నోరు పకలదు..." అంది ప్రియాంక.

కాసేపయ్యాక విడిపోయేటప్పుడు శ్రీవాత్సవ అన్నాడు. "రేపు నీ కార్ షీట్ కావాలి. దొరుకుతుందా?"




"అంత గొప్పదాన్నేం కాదులే" అంది నవ్వుతూ.

మర్నాడు శ్రీవాత్సవ ప్రియాంకను తన ఇంటికి తీసుకెళ్ళి చూపించాడు. అతను ఎలాగూ ఎవరికేనా రెండుగదులు అద్దెకిద్దామనుకుంటున్నాడు. ఆమె ఉంటానంటే సంతోషంగా వచ్చి ఉండమన్నాడు. అద్దె ఎంత ఇవ్వమంటావు అని అడిగింది.

"ఈ ఇంట్లో నీ చిరునవ్వుల వెన్నెల చిందిస్తే చాలదా? వేరే అద్దెకూడా ఎందుకు?" అన్నాడు శ్రీవాత్సవ.

అలా కాదంటే, ఇచ్చినంత తీసుకుంటానన్నాడు. రెండురోజుల తర్వాత ఆమె ఇంట్లో దిగిపోయింది.

ఇద్దరూ ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ, జోక్‌లు వేసుకుంటూ, రోజులు నిముషాల్లా గడిపేస్తున్నారు. వయసు ఒంటరితనం వాళ్ళను మరింత సన్నిహితం చేస్తోంది.

అతను ఆఫీసునుంచి మధ్యాహ్నమే వచ్చేస్తే అప్పుడే వచ్చేశావేం అని అడిగింది.

"మా బాస్ కాంపు కెళ్ళాడు. ఆయన లేకపోతే అడిగేవాడు లేడు, చెప్పేవాడు లేడు - నో ఆస్కర్. నో టెల్లర్" అన్నాడు.

ఆవేళ సాయంత్రం సినిమా కెళ్లారు. హోటల్లో భోంచేసి వచ్చారు. వాళ్ళు ఆటోలో వెళ్తుంటే సాధన చూసింది.

ఇంటికొచ్చాక శ్రీవాత్సవ. ప్రియాంకను కౌగిలిలోకి తీసుకుంటే, ఆమె మృదువుగా అతని చేతుల్ని తొలగించింది.

"ఈ కౌగిలి నాది కాదు. మరొకరిది" అంది.

"కౌగిలి పేరుకు పెళ్ళానిదే అయినా అదెప్పుడూ ప్రియురాలి ప్రిరాగేటివ్" అన్నాడు శ్రీవాత్సవ.

అయినా ప్రియాంక మౌనమే వహించింది. మనసు పడే ఉబలాటాలకూ వయసుతో వచ్చే పోరాటాలకూ ఎక్కడా పొంతన కుదరదు.

చూపుల్లోనూ, చేతల్లోనూ మాటలకందని భావం ఏదో ఇద్దరికీ అర్థమవుతోంది. దాన్నే సైలెంట్ లాగ్వేంజ్ ఆఫ్ లవ్-అంటారు.

ఆమె నుదురుమీద తారాడే ముంగురులను సవరించాలని, ఆనందంగా నవ్వుతుండగా, ఎగిరిపడే ముందరున్న అందాలను ఆపాలని, పైపంటితో కింది పెదవిని నొక్కిపెట్టినప్పుడు అమృతం పొలుకుతుందేమో చూడాలని, వెన్నెల్లో తెల్లని మధుపర్కాలు కట్టుకొనివచ్చి

పక్కన కూర్చుంటే, పొదివి పట్టుకోవాలని అనిపించే మధురమైన ఘడియలన్నీ అతన్ని హమేషా విషాలోకాల్లోకి లాక్కుపోతున్నాయి.

అతని కనుపాపలనిండా ఆమె రూపమే నిండి ఉంటోంది. ఆమె నివసిస్తోంది ఆ గదిలో కాదు అతని హృదిలో.

ఆడదీ, మగాడూ ఒకరికొకరు ఏదో చేద్దామని ఆశపడుతున్నారు. ఆరాటపడుతున్నారూ అంటే, వాళ్ళల్లో ప్రేమలోపడి కొట్టుకుంటున్నారనేఅర్థం.

"అప్పట్లోనే నీ చెయ్యిపట్టుకు లాక్కుపోయి పెళ్ళి చేసుకుందాం అనిపించేది ప్రియాంకా" అన్నాడతను ఆమె చేతి మీద చెయ్యివేసి.

"ఇప్పుడూ నా చెయ్యి పట్టుకునే ఉన్నారు" అని గుర్తుచేసి నవ్వింది తన చేతిని వెనక్కి లాక్కుంటూ.

"కానీ చాలా ఆలశ్యం చేశాను. పరాయి ఆడపిల్లతో తిరగాలంటే అప్పుడేమో సిగ్గు ఇప్పుడేమో సిగ్గుచేటు."

"అయినా మీకు సరిజోడునే ఎన్నుకున్నారని మీ పెళ్ళి అప్పుడు అందరూ అనుకోగా విన్నాను ... కాలిజోడు, కళ్ళజోడు కాదుగదా, మార్చి మరొకదాన్ని ఎంచుకోవటానికి" అని కూడా అంది ప్రియాంక.

"అప్పట్లో నేను అంతగా పట్టించుకోలేదుగాని అది పెళ్ళినాడే అందరి ముందూ నా నెత్తిన చెయ్యిపెట్టింది, జీలకర్రా బెల్లం పట్టుకుని" అన్నాడు శ్రీవాత్సవ.

ప్రియాంక పకపకా నవ్వింది. "ఇది ప్రతి మగాడికి జరిగే శాస్త్రే" అంది.

ఒకరోజు ఆమె స్నానంచేసివచ్చి చీర మార్చుకుంటుంటే అతను సడెన్‌గా గదిలోకి వచ్చాడు. మోహపూరితమైన అతని చూపుల్లోని వ్యామోహానికి ఆమె మరింత సిగ్గుతో ముడుచుకుపోయింది.




ఉప్పెనలా వచ్చి మీదపడ్డాడు. అతన్ని ఎదుర్కొనడానికి ఆమెకు శక్తి చాల్లేదు విల్లంబులా వొంగిపోయింది, లొంగిపోయింది. ఇంక అతని దగ్గర ఆమెకు దాచుకోవాల్సిందేమీ లేకపోయింది. సర్వార్పణమస్తు అయిపోయింది. బ్రతుకులోని మాధుర్యమూ తెలిసిపోయింది.

ఇంకోరోజు ఆరుబయట వెన్నెట్లో పడుకుని పక్కనే కూర్చున్న ప్రియాంక పొత్తికడుపు మీదనుంచి చూపుడు వేలును పైకి జరిపే ప్రయత్నంచేస్తూ నవ్వాడు. దేనికని అడిగింది.

"బ్యాటరీలైటులాగా ఆడదాన్ని నొక్కిపట్టినచోట నొక్కితే మనకు కావాల్సిన వెలుగునిస్తుంది." అన్నాడు శ్రీవాత్సవ.

"ఇంతకీ ఈ సన్నాయి నొక్కులన్నీ నొక్కటం దేనికో?" అన్నది ప్రియాంక.

"నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను .." అన్నాడు.

"అవంత అవసరమా?" అంది ప్రియాంక.

"నీకు అవసరం లేదా?" అని అడిగాడు!

కొంచెం సేపు ఆలోచించింది.

"నాక్కొంచెం టైంఇవ్వు" అంది.

"ఓ అరగంట చాలా?"

"చాలదు. ఆరు నెలలు అయినా కావాలి."

"నీ దయ" అన్నాడు శ్రీవాత్సవ.

భర్త ఇంట్లోకి ఎవరో వచ్చి జెండా పాతేసిందన్న విషయం సాధనకు తెల్సి మరింత కుములిపోయింది. ఆనాడు ఏ శనిదేవతో తన నెత్తిన తాండవమాడబట్టే ఈ బుద్ధులన్నీ పుట్టాయి. తన నోట ఆ మాటలన్నీ వచ్చాయి: అన్నవన్నీ నిజంచేసి చూపిస్తున్నాడాయన. పైగా ఆయన్ని ఇదేమని అడగటానికి. తప్పుపట్టటానికి తనకు గాని. మరొకరికి గాని ఇప్పుడు అధికారం ఏముంది? ఆ స్వేచ్ఛను తనే ఇచ్చింది! వీలు కల్పించింది.

తాను విడాకులు తీసుకున్నట్లు లోకమంతా తెల్సు. మళ్లా మాట్లాడితే ఆయన వంక కన్నెత్తిచూసే యోగ్యత కూడా తనకు లేదు. తేలుకుట్టిన దొంగలా నోరుమూసుకు పడి ఉండాల్సిందే.

ఒక సంసారానికి రెండుఇళ్లు, రెండు కాపరాలు కావాలని అనుకోవటమే అసలైన ముప్పు. ఈ టూ-ఇన్-వన్‌లు పనిచెయ్యవు కానీ జ్ఞానోదయం అయ్యే

ఇప్పటికే జరగవల్సిన అపకారం జరిగిపోయింది.

అయినా ఈ మగాళ్ళను నమ్మటానికి వీల్లేదు. లోకంతో నాకేంపని అని మంచుకొండలమీద ముక్కుమూసుకుని కూర్చుంటానంటూ వెళ్ళినవాడు, లిరిపమెత్తుకునే శివుడుకూడా, నా బెటర్ హాఫ్‌వి నువ్వేనంటూ పార్వతిని మభ్యపెడుతూనే, గంగను తెచ్చి నెత్తిన పెట్టుకున్నాడు. ఇంక ఈయనెంత చెప్పు?

ఇద్దరి పిల్లలకీ చెరో ఇల్లూ ఉన్నా లని ఆరాపడింది. ఇళ్ళమాట దేవుడెరుగు వాళ్ళకీ తల్లీతండ్రీ దక్కకుండా పోయ్యారు. ఎంత ఆస్తి ఇస్తేమాత్రం ఆ లోటు వాళ్ళకెలా తీరుతుంది? అసలు ఆస్తిమాత్రం ఏం మిగిలింది? అక్కడెవరో ఒక మహాతల్లి వచ్చి భిక్ష వేయనేవేసింది. ఇంక ఈ పిల్లలకు ఆయనచేతి ముష్టి అయినా వేయనిస్తుందా? ఇప్పుడు సాధన నిద్ర మాత్రలు వేసుకుంటేగాని, నిద్రపట్టని పరిస్థితిలో ఉంది.

చివరి ప్రయత్నంగా చూద్దామని పనిమనిషిని తోడుఇచ్చి పిల్లలిద్దర్నీ ఆయన దగ్గరకు పంపించింది.

ప్రియాంక పిల్లలిద్దర్నీ దగ్గరకు తీసుకుంది. వాళ్ళ స్కూళ్ళ గురించి, చదువుల గురించీ ఎన్నో అడిగింది. తనూ చిన్నపిల్లలా మారిపోయి వాళ్ళతో ఆడుకుంది. కేరంబోర్డు కొట్టింది. షికార్లకు తిప్పింది. ఐస్ క్రీంలు తినిపించింది.

పనిమనిషిని కూడా రెండు రోజు లుంచుకుని. పాతిక రూపాయలు ఇచ్చి పంపించింది. పిల్లలుమాత్రం పండగ వెళ్ళాక వస్తారని చెప్పమంది.

పనిమనిషి చూసింది చూసినట్లు సినిమా కథ చెప్పినట్లు చెప్పింది

"ఇప్పుడా అమ్మగారు ఎంతచెడితే అయ్యగారు అంతేనమ్మగారు. చినబాబు రాత్రి పదిగంటలప్పుడు కూల్ డ్రింక్ కావాలన్నారండీ! అయ్యగారు నోరు మూసుకు పడుకో అని కోప్పడ్డారండి. కానీ ఆ అమ్మగారు పోనీపాపం వెళ్ళి వస్తుంది అంటే చొక్కా తగిలించుకుని వెళ్ళి పట్టుకొచ్చారండీ. అప్పటికే చినబాబు నిద్దర పోయ్యాడండీ. అయ్యగారు తాగేస్తున్నారండి. కానీ అమ్మగారు ఒప్పుకోలేదండి. తెల్లారాక వాడే తాగుతాడని దాచేసారండి..."

ఇలాంటివన్నీ కళ్ళకు కట్టినట్టు చెప్పింది. సాధన దీర్ఘంగా నిట్టూర్చింది.

"ఈ అయ్యగార్ని అమ్మగారు హిప్నటైజ్ చేసిందన్నమాట. అమ్మగారు నిల్చుంటే నిల్చూ, స్టాండంటే స్టాండూ అయిపోతున్నారన్నమాట..." అనుకుంది.

"ఆ అమ్మగారు కూడా మంచివమ్మగారూ" అంది ముక్తాయింపుగా.

"అవునవును. నీకో పాతిక రూపాయ లిచ్చిందిగదా మంచిదే. ఇంకొకరి ఇల్లూ, మొగుడూ అప్పనంగా దొరుకుతుంటే పాతికేం, యాభై అయినా ఇవ్వొచ్చు" అంటూ సాధనకూడా మెచ్చుకుంది.

ప్రియాంక రాత్రి ఎనిమిది గంటలప్పుడు పిల్లలిద్దరికీ అన్నాలు తినిపించి, నాలామీద పక్కలు పరచి పడుకోబెట్టి కథలు చెబుతూ నిద్రమంపులో ఉన్న పిల్లల్ని అడిగింది.

"శ్రీహర్షా, నీకు పండగకు ఏం కావాలిరా?" అని ఆప్యాయంగా అడిగితే, పిల్లలిద్దరూ చటుక్కున లేచారు. నిద్రంతా ఏమైపోయిందో గాని.


ఇద్దరూ చెరో తొడమీదా కూర్చుని. లేత చేతులతో ఆమె గడ్డం పట్టుకు బ్రతిమిలాడుతూ అడిగారు.

"మాకు మమ్మీ, డాడీ ఇద్దరూ కావాలి, ఆంటీ... డాడీని మమ్మీ దగ్గరకు పంపించు ఆంటీ... ప్లీజ్ ఆంటీ..."

అని వాళ్ళు అడుగుతుంటే ప్రియాంక కళ్ళల్లో గిర్రున నీళ్ళుతిరిగాయి. అవును, నిజమే. పిల్లలకు అమ్మా, నాన్నా ఇద్దరూ కావాలి. ఎవరు లేకపోయినా ఆ లోటు తీరేదికాదు. చిన్నప్పుడే తనకు తల్లి చచ్చిపోయింది. ఆ బాధ తనకూ తెలుసు.

"అలాగే పంపిస్తా"నని వాళ్ళను నిద్రపుచ్చింది.

శ్రీవాత్సవ ఇంటికొచ్చాక, ఇద్దరి భోజనాలూ అయ్యాక, ప్రియాంక ఈ ప్రస్తావన తెచ్చింది.



"రేపు పండగ. మీరూ పిల్లలూ మీ ఆవిడ దగ్గరకు వెళ్ళండి..." అంది.

"మేం విడాకులు తీసుకున్నాం. నాకు భార్య అంటూ ఇప్పుడు ఎవరూ లేరు" అన్నాడతను.

"పోనీ ఒకప్పుడుంది కదా. ఆమె ఇంకా బతికే ఉంది కదా. మీ అహం కాం దెబ్బతిన్నా సరే, ఒకమాట చెప్ప దల్చుకున్నాను. భార్యచేసే అప్పులకే కాదు, తప్పులకీ భర్తే బాధ్యుడు. కనుక జరిగినదానిలో మీ లోపమూ ఉంది. ఆమె కోర్టులో అన్ని అబద్ధాలు చెప్పినప్పుడు, అవన్నీ నిజమేనని ఎందుకు ఒప్పుకున్నారు? ఆ ఆరోపణలను రుజువు చేసే బాధ్యత ఆమెమీద పెట్టేస్తే, వాటిల్లోని బండారం బయటపడేది కదా ...ఇప్పుడు మీరింత గింజుకోవాల్సిన పనీ ఉండేదికాదు..."

శ్రీవాత్సవ మాట్లాడలేదు. మళ్ళీ ఆమె అందుకుంది.

"బంగారంలాంటి పిల్లలు. వాళ్ళు ఏం తప్పు చేశారు? మీ మూర్ఖత్వానికి వాళ్ళెందుకు బలికావాలి? నా మాట విని రేపు పిల్లల్ని తీసుకుని వెళ్ళండి."

"నువ్వేం చెప్పినా వింటాను గాని, దాని ఇంటికి మాత్రం వెళ్ళను..."

"పోనీ నే వెళ్ళి ఆమెను తీసుకొస్తాను..."

"నువ్వేమైపోతావు?"

"ఎలా వచ్చానో అలాగే పోతాను. కొన్నేళ్ళ మన స్నేహానికి చిహ్నంగా ఈ కొద్దిరోజుల సాన్నిహిత్యం మిగిలిందనుకుంటాను" ... అంది ప్రియాంక.

"ఆలోచించుకునే అంటున్నావా?"

"అన్నీ బాగా ఆలోచించే అంటున్నాను. అందుకే మీరు అడిగినప్పుడు ఆరునెలలు గడువు కావాలన్నాను. ఈ గడువు తీరేదాకా మిమ్మల్ని కలపటానికే ప్రయత్నిస్తాను. అప్పటికీ నా ప్రయత్నాలేవీ ఫలించకపోతే, అప్పుడు మనం పెళ్ళి చేసుకుందామనే అనుకున్నాను..." అంది ప్రియాంక.

"నీ ఇష్టం,"

"రేపు వెళ్ళి ఆవిడ్ని తీసుకొస్తాను. ఆవిడ ఏడుస్తుంటే నేను సుఖపడలేను. నాకు అక్కర్లేదా ఆనందం... ఆమెకు ఇష్టంలేకపోతేనే...అదేదో రేపే తెల్సిపోతుంది" అని ప్రియాంక అంటున్న సమయంలోనే ___

అక్కడ సాధన నిద్రమాత్రలు మింగి ఇంక ఈ యాత్ర చాలించే ఉద్దేశ్యంలో ఉంది.

'ఈ ఇల్లు తను కావాలని తలుపులూ పెట్టుకుని కోరి కట్టుకున్న గోరిలా ఉంది. ఈ గోరీముందు చలువరాతి రాయిమీద తన పేరు కూడా చెక్కించుకుంది ముందుగానే. ఈ అదృష్టం మాత్రం ఎంతమందికి దక్కుతుంది?'

అనుకుంటూ నిద్రమాత్రలు కలుపుకుంటోంది...... 'తొమ్మిది, పదీ, పదకొండూ, పన్నెండూ...' ✻

***With best compliments from***

Phone : 230
Resi : 474

## పిన్నమనేని శేషాద్రి అండ్ కో.,

**కంట్రాక్టర్సు : శ్రీ జయలక్ష్మి రైస్ మిల్**

మేనేజింగ్ పార్టనర్ : పిన్నమనేని రాజారావు

గుడివాడ [కృష్ణాజిల్లా]